


# పరదేశీ కథలు

– చిట్టే సిద్ధ లలిత



- 116 -

## "స్టోర్ రూమ్"

**కిర్రుమని తలుపు** తెరిచిన శబ్దంతో ఇంకాస్త ముడుచుకుని మూలకు కూర్చున్నాడు భాషా. గదిలో లైటు వెలిగింది.

సింహళ భాషలో ఏదో పాట పాడుకుంటూ లోనికి వచ్చింది తార. ఆమె తను వున్న చోటుకు రాకూడదని అల్లాను ప్రార్థిస్తున్నాడు భాషా. కానీ అల్లా అతడి మొర ఆలకించలేదు.

ఆమె సరాసరి అతడున్న చోటికి వచ్చి ఏదో వంట వస్తువు కోసం డబ్బాల్లో వెతకసాగింది.

ఆమె తనని చూస్తే ఏం జరుగుతుందో తెలుసు అందుకే ముందు జాగ్రత్తగా పక్కనే వున్న ఇనప కమ్మీని చేతిలోకి తీసుకున్నాడు.

అదే అతడు చేసిన పొరపాటు. అలికిడికి పాములా తలెత్తి అటు చూసింది తార. దొరికిపోయాడు భాషా.

వెంటనే గంగాళంలాంటి నోరును తెరిచి "బాబా.. బాబా.. బాషా ఇక్కడ దాగివున్నాడు" అంటూ కేకలు వేసింది.

బాబా ఆ కేకలు వింటే తనకు పట్టే గతి ఏంటో అతడికి తెలుసు. అందుకే వెంటనే పులిలా లేచాడు భాషా. చేతిలో వున్న ఇనప చువ్వతో బలంగా తార తలపై కొట్టాడు. కిక్కురుమనకుండా నేల మీద పడిపోయింది తార.

తల పగిలినట్లుంది. రక్తం ఉబికి వస్తోంది.

ఇక ఆలస్యం చేయలేదు భాషా. రివ్వున బయటికి పరిగెత్తి పక్కనే వున్న ప్రహరీ గోడను దూకి పారిపోయాడు. కళ్ళు మూసి తెరిచేంతలో అవతలి వీధిలో వున్నాడతడు.

ఆ సమయంలో ఇంట్లో టివి శబ్దాలు గట్టిగా వుండడంతో స్టోరు గదిలో తార అరిచిన అరుపులు ఎవరూ వినలేదు. భాషా పరిగెత్తిన విషయమూ గమనించలేదు.

గంట తరువాత వంటింట్లో మాడువాసన రావడంతో "తారా ఎక్కడ చచ్చావే" అంటూ సేటానీ వంటింట్లోకి వచ్చింది.

తార కనిపించకపోయేసరికి స్టవ్ ఆఫ్ చేసి తార కోసం వెదకనారంభించింది.

కద్దామాలను పిలిచి తార ఎక్కడుందో వెతకమని చెప్పింది సేటాని. అందరూ పోయి ఆ విల్లాలోని అన్ని గదులనూ వెతకసాగారు. ఆఖరికి సిద్దాఫ్ (సెల్లార్) లోని సామాన్ల గదిలో తలపగిలి కింద పడివుంది తార.

బతికే వుందో చచ్చిందో తెలియక కంగారుపడుతూ అంబులెన్స్ కు ఫోన్ చేసారు.

వాళ్ళు వెంటనే వచ్చి తారను హాస్పిటల్ కు తీసుకు వెళ్ళారు.

✱✱✱

స్పృహలో లేదు తార. తలకు గుండుచేసి కట్టు కట్టారు డాక్టర్లు. తలకు దెబ్బ బలంగానే తగిలింది. తెలివి రావడానికి నాల్రోజులు పడుతుందని చెప్పారు.

ఎవరు కొట్టారు? ఎందుకు కొట్టారు? అసలు ఆ స్టోర్ రూములో ఏం జరుగుతోంది..? అనే సందేహాలు అందరిలో.. కానీ పని మనుషులందరూ దానికి తగిన శాస్తి జరిగిందని లోలోపల సంతోషించారు.

గుండుతో వున్న తారను తలచుకుని నవ్వుకున్నారు. దాదాపు వారంరోజుల తర్వాత నీరసంగా ఇంటికి వచ్చింది తార.

అరుపులతో అందరినీ హడలెత్తించే తార తలకు కట్టుతో వింతగా కనిపించింది. "ప్రాణాపాయం తప్పిందని మరో పదిరోజులు విశ్రాంతి తీసుకోవాలని" డాక్టర్లు చెప్పడంతో తన గదిలో పడుకునే వుంటోంది తార.

ఆమె గదిలోకి వెళ్ళి పరామర్శించే పనిమనుషులు చాటుగా నవ్వుకోవడం తార కంట పడకపోలేదు.

"ఆరోగ్యం కుదుటపడి లేచాక చెప్తా మీ పని" అనుకుంటూ కసిగా పళ్ళు నూరుకుంది తార.

"బాబా.. భాషాను వదలకండి. ఎలాగైనా వాడ్ని పట్టుకోండి. జాన్వర్ (మృగం) నేను స్టోర్ రూములోకి వెళ్ళగానే ఇనప చువ్వతో నా తలపైన కొట్టాడు. ఇంకాస్త పెద్దదెబ్బ తగిలితే చచ్చిపోయేదాన్ని."చెప్పి బావురుమంది తార.

"వాడు చాటుగా స్టోర్ రూములో దాగి ఇంత పని చేసాడా.. వాడి పని చెపుతాను" పళ్ళు కొరికాడు సేటు.

భాషాను వెతకడానికి ఊరిమీదకి పదిమంది మనుషులను పంపించాడు.

"భాషా కనిపిస్తే కాళ్ళు చేతులు విరిచి తీసుకురమ్మని" చెప్పాడు.

✱✱✱

ఎడారి ఎండ మండిపోతోంది. సులైబియాలోని ఒక పార్కులో ఖర్జూరపు చెట్టు నీడన కూర్చున్నాడు భాషా.

మధ్యాహ్నం వేళ ఆకలితో కడుపు కరకరలాడుతోంది. జేబులు వెతికాడు. అదృష్టం కొద్దీ మియా ఫిల్స్ (వంద) బిళ్ళలు రెండు దొరికాయి. బతికిపోయాను అనుకుంటూ అటు ఇటు చూసి ఎవరూ లేరనుకుని దగ్గరలో వున్న జమియా (అంగడి) లోకి వెళ్ళి ఒక కుబూస్ (రొట్టె) పేకెట్, ఒక బీన్స్ డబ్బా కొని కౌంటర్ దగ్గరికి వచ్చాడు.

ఎవరో తననే పరిశీలనగా చూస్తున్నట్టు అనిపించి ముఖం చాటు చేసుకుని బయటపడ్డాడు.

తార సేటుతో చెప్పి తనను వెతకడానికి మనుషులను పంపిందన్న మాట అనుకుంటూ వెనకనుండి తిరిగి కార్లను చాటు చేసుకుంటూ పార్కులోకి చేరుకున్నాడు.

చిన్న పొద చాటున కూర్చుని కుబూస్ పేకెట్ విప్పి తినబోయాడు.

ఇంతలో.. "అదిగో వాడు అక్కడ వున్నాడు పట్టుకోండి" అని కేకలు వేస్తూ పరిగెత్తుకుని వచ్చారు నలుగురు రౌడీలు.

రొట్టెలను చేత పట్టుకుని పరుగు లంకించుకున్నాడు భాషా. ఎంత పరిగెత్తినా వాళ్ళ చేతుల్లోంచి తప్పించుకోవడం అసంభవం అని తెలుస్తోంది. కానీ ప్రయత్నించాలి.

జమియా చుట్టూ తిరిగి ఆ పక్కనున్న ప్రాంతంలోకి పరుగు తీసాడు. వెనక వచ్చేవారు దగ్గరవుతున్నారు.

ఇక చిక్కిపోతాడు అనుకునే లోపల రయ్ మని వచ్చి పక్కనే ఆగింది ఒక ఆడి కారు.

"హేయ్ ఏమయింది..? ఎందుకు అలా నా కారుకంటే వేగంగా పరిగెడుతున్నావు" ప్రశ్నించాడు ఒక కువైటీ కుర్రవాడు.

"సలామాలేకుం అల్లా కల్లిక్ నన్ను కాపాడండి" అర్థించాడు భాషా.

ఏ కళన వున్నాడో ఆ పిల్లోడు డోర్ తెరిచి "రా" అన్నాడు నవ్వుతూ..

వెంటనే గిరుక్కున కారును గుండ్రంగా తిప్పి ముందుకు ఉరికించాడు. దుండగులు తేరుకునే లోపల కనురెప్పపాటులో ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళిపోయింది కారు.

కువైటీ కుర్రకారు కారును చాలా వేగంగా నడుపుతారు. మార్కెట్లోకి వచ్చిన కొత్తకార్లను కొని నడపడమంటే వారికి చాలా మోజు.

అతడి పేరు అహ్మద్. ఓ అరగంట తరువాత తీసుకెళ్ళి భాషా తప్పించుకున్న ఏరియాకే తీసుకెళ్ళి పక్క వీధిలో ఆపాడు.

"హేయ్ బుడ్డా (ముసలీ) నాకిక్కడ పని వుంది. నాతో వస్తావా.. నీ దారిన నువ్వు పోతావా" అని అడిగాడు.

నేను పోతాను అంటూ కారు దిగాడు భాషా.

ఇంతలో ఎక్కడ వున్నారో తెలియదు కానీ నలుగురు రౌడీలు వచ్చి చుట్టుముట్టి పెడరెక్కలు విరిచి పట్టుకుని కళ్ళు బైర్లు తిరిగేట్లు ఫెడీమని నాలుగు దెబ్బలు కొట్టారు. తల తిరగడంతో లొంగిపోయాడు భాషా.

తీసుకెళ్ళి సేటు కాళ్ళ దగ్గర పడేసారు వాళ్ళు.

ఊరంతా తిరిగి మరలా ఇంటి ముందుకు వచ్చి పడినట్లయింది భాషా పరిస్థితి. ఇష్టమొచ్చినట్లు కాళ్ళతో ఫుట్ బాల్ లా తన్నాడు సేటు. రక్తం కారిపోతుంటే కేకలు వేసాడు భాషా.

ఆ కేకలు విని లోపల పని చేసే కద్దామాలు అందరూ పరుగున ముందు వైపు వరండాలోకి వచ్చారు.

మంచంపై వున్న తార కూడా లేచి బయటికి వచ్చింది.

భాషాను చూసి "వాడు హంతకుడు, దుర్మార్గుడు. వాడిని తన్నండి బాబా.. వాడిని పోలీసులకు పట్టించండి. సుష్మాను చంపడమే కాకుండా నన్ను కూడా కొట్టాడు. వాడిని వదలకండి బాబా" అంటూ ఆవేశంగా అరిచింది.

కద్దామాలందరూ భాషా వైపు జాలిగా చూసారు. పది రోజులుగా తిండినీళ్ళు లేకుండా తిరుగుతున్నాడేమో తలవాల్చేసాడు భాషా. ఊపిరి వుందా అనేది అనుమానమే.

అప్పటికి కానీ సేటు కోపం చల్లారలేదు. "వీడి మొహాన నీళ్ళు కొట్టండి. బతికే వుంటే దువానియాలోని హమాం (బాత్ రూం)లో తోసి తాళం వెయ్యండి. పోలీసులను పిలుద్దాం.చచ్చే వుంటే తీసుకెళ్ళి ఎడారిలో పూడ్చిపెట్టండి" చెప్పి లోపలికి వెళ్ళిపోయాడు సేటు.

అందరూ తార వైపు అసహ్యంగా చూసారు. భాషా అంతపని చెయ్యడని వాళ్ళకు తెలుసు. ఇందులో ఏదో కుట్ర దాగివుంది.ఎలా దీనిని కనుక్కోవాలి అనే ఆలోచనలో పడ్డారు వారు.

భాషా మొహాన నీళ్ళు చల్లి కొన్ని నీళ్ళు తాగించారు. కొన ఊపిరితో వున్నాడు భాషా.

"నాకేం తెలియదు. నేను సుష్మాను చంపలేదు" అని గొణుగుతున్నాడు.

కద్దామాలందరూ గుమిగూడి గుసగుసలాడుకున్నారు.

"ఈ అన్యాయాన్ని సహించేది లేదు. నిజాన్ని కనుగొని సేటుకు చెప్పాలి" అంది నీలిమ.

"అవును తార బాయ్ ఫ్రెండ్ పీటర్ స్టోర్ రూముకు వచ్చిపోవడం నేను కళ్ళారా ఎన్నోసార్లు చూసాను.భయపడి ఈ విషయం ఎవరికీ చెప్పలేదు" అంది రీమా.

"వాడికి బియ్యం, నూనె, పప్పు, మాంసం అన్నీ మూటలు కట్టి ఇచ్చి పంపడం నేనూ చూసాను. భాషా సుష్మను చంపడం అబద్ధం. ఏదో జరిగింది. అది మనం బయటపెట్టి భాషా నిర్దోషి అని నిరూపించాలి.

భాషాను హత్య జరిగిన ఆ స్టోర్ రూంలోనే ఒక మూల వుంచిఎవరూ చూడకుండా అతడికి చాటుగా అన్నం, నీళ్ళు తీసుకెళ్ళి నేనే అందించాను. అక్కడయితే ఎవరికీ అనుమానం రాదనుకున్నాను. అలా పదిరోజులు అతడిని కాపాడగలిగాను.

తరువాత అతడి దురదృష్టం కొద్దీ తార కంటపడి విధిలేని పరిస్థితుల్లో ఆమెను కొట్టి తప్పించుకున్నాడు.

సుష్మ హత్య జరిగిన రోజు పీటర్ తారతో కలిసి ఆ స్టోర్ రూములోకి వెళ్ళడం తరువాత అతడు కంగారుగా వెళ్ళిపోవడం గమనిస్తే ఇందులో ఏదో రహస్యం దాగి వుంది అనిపిస్తోంది.

తరువాత తార పీటర్ ను పిలిపించి గోడ పక్కన చాటుగా మాట్లాడటం నేను చూసాను. నాకెందుకులే వాళ్ళ సంగతి ఇదంతా మామూలే కదా అని నా దారిన నేను పనిలోకి వెళ్ళి పోయాను. ఆ హత్య వీళ్ళద్దరే చేసి భాషా పైన మోపి అతన్ని దోషిగా నిలబెట్టారు అని తెలుస్తోంది. భాషా కూడా అదే అంటున్నాడు.

ఇదంతా తార వేసిన ప్లాను. తార మంచిదని సేటు నమ్ముతున్నాడు. కాబట్టి మనం అందరం కలిసి ఈ విషయం సేటుకు చెప్దాం. దాని గుట్టు కనుగొని బయట పెడదాం" అంది నీరజ కోపంగా.

"అవును సేటు కొడుకు బయట కెమెరా పెట్టాడు కదా. దాన్లో చూస్తే తెలుస్తుంది కదా" అంది రీమా.

"హేయ్ నిజమే. ఈ ఆలోచన మాకు ఎవరికీ తట్టలేదు గుడ్ ఐడియా" అంటూ రీమా భుజం తట్టింది నీలిమ మెచ్చుకోలుగా "భాషా అమాయకుడని నిరూపిద్దాం.

కెమెరా చూడమని, అసలు ఆరోజు ఏం జరిగిందో చూడమని సేటుకు చెప్దాం" హుషారుగా అంది రీమా.

అంతలో తార అక్కడికి వచ్చింది.

"హేయ్ తారా నిజం చెప్పు. అసలు ఆ స్టోర్ రూములో ఏం జరిగిందో సుష్మను ఎవరు చంపారో నిజం చెప్పు."

కళ్ళెర్రజేసి ప్రశ్నించింది నీరజ.

తడబడింది తార.

"నో నాకేం తెలియదు నన్ను ఏమైనా అంటే బాబాకు చెప్తా" అంటూ కంగారుగా వెళ్ళిపోయింది.

"ఇదే ఆ హత్య చేసింది. అమాయకురాలైన సుష్మా ప్రాణాలు తీసింది. ఆ కంగారు చూస్తుంటే తెలుస్తోంది కదా..

పదండి సేటుకు చెప్పి కెమెరా చూద్దాం" అంది రీమా.

అందరూ కలిసి బాబాకు విషయం చెప్పారు. ముందు బాబా నమ్మలేదు. తరువాత కెమెరా చూసి ఆశ్చర్యపోయాడు.

"తారకు బాయ్ ఫ్రెండ్ వున్నాడా? ఇంటిదగ్గరికి వస్తున్నాడా? స్టోర్ రూములో కలుసుకుంటున్నారా? సామాన్లు మూటలు కట్టి ఇస్తోందా? మరి ఇన్నిరోజులూ మీరంతా ఈ విషయాన్ని నాకెందుకు చెప్పలేదు?" కళ్ళెర్రజేసాడు బాబా

ఎంత నీచురాలు అంటూ తారను పిలిచి నిజం చెప్పమని గద్దించాడు. భయంతో వణికింది తార. కొరడా తీసుకుని వళ్ళంతా వాయించాడు.

వెంటనే ఫోన్ చేయించి పీటర్ ను పిలిపించారు. కోపంతో వాడి జుట్టు పట్టుకుని చావగొట్టాడు బాబా. ఏం జరిగిందో నిజం చెప్పమన్నాడు.

ఒక్కో విషయం బయటికి వస్తుంటే ఆశ్చర్యపోయారు అందరూ.

అసలేం జరిగిందంటే..తారతో సంబంధం కలిగిన పీటర్ చాటుగా వచ్చి పోతుండే వాడు. వాళ్ళు స్టోర్ రూమును కేంద్రంగా చేసుకుని యెధేచ్ఛగా తమ కోరికలను తీర్చుకునే వారు.

అంతటితో ఆగితే బావుండేది. కానీ వాళ్ళు పర దేశంలో పని మనుషులుగా వున్నామనే స్పృహను మరిచారు.

కాలక్రమేణా పీటర్ కన్ను సుష్మపైన పడింది. ఎలాగైనా సరే ఏదో ఒకటి చేసి సుష్మను స్టోర్రూముకు పంపమని ఒకసారి తన కోరికను తీర్చేలా చేయమని లేకపోతే తారతో సంబంధాలు తెంచుకుంటానని తారను బెదిరించాడు ఆ నీచుడు.

వాడి మోజులో పడి నీతి నియమాలు మరిచింది తార.

మెల్లగా సుష్మకు విషయం చెప్పి ఒకసారి పీటర్ కోరిక తీరిస్తే వంద దినార్లు ఇస్తానని ప్రలోభ పెట్టింది.

సుష్మ ఒప్పుకోలేదు.

ఒకరోజు స్టోర్ రూములో వున్న బియ్యాన్ని పట్టుకురమ్మని చెప్పి సుష్మను స్టోర్ రూముకు పంపింది తార.

సుష్మ వెళ్ళింది.

సుష్మ లోనికి వెళ్ళగానే బయట తలుపుకు గొళ్ళెం పెట్టింది తార. అప్పటికే లోపల వున్న పీటర్ సుష్మను బలాత్కారం చేసాడు.

సిద్దాఫ్ (సెల్లార్) లో వున్న స్టోర్ రూము నుండి సుష్మ కేకలు బయటికి వినబడలేదు.

సుష్మ సహకరించకుండా గట్టిగా గింజుకోవడంతో ఆమెను కొట్టాడు పీటర్. దెబ్బ తగలరాని చోట తగిలిందేమో స్పృహతప్పి పడిపోయింది సుష్మ. అలాగే ఆమెను అనుభవించాడు ఆ నీచుడు.

కాసేపటికి సంతోషంగా బయటకు వచ్చాడు పీటర్. తార నవ్వుతూ వాడిని సాగనంపి లోపలికి వెళ్ళింది. సుష్మకు స్పృహ పోయిందో చచ్చిందో అర్థం కాలేదు. కుదిపి చూసింది. అప్పటికే శరీరం చల్లబడినట్లు అనిపించింది.

తారకు భయమేసింది.

ఏం చెయ్యాలా అని ఆలోచించింది.

మామూలుగానే వంట గదిలోకి వెళ్ళి వంట చేస్తూ..

"రేయ్ భాషా.. స్టోర్ రూముకు పోయి నూనె డబ్బాలు తీసుకురా" అని కేకేసింది.

"సరే అక్కా" అంటూ భాషా స్టోర్ రూములోకి వెళ్ళాడు.

వెనుకే వెళ్ళిన తార బయట గొళ్ళెం పెట్టి కేకలు వేసింది.

బాబా మామా కద్దామాలు అందరూ పరిగెత్తుకుని వచ్చారు.

"బాబా బాబా.. భాషా సుష్మా ఈ స్టోర్ రూములోకి వెళ్ళారు. లోపల ఏం చేస్తున్నారొ తెలియదు" అంటూ కట్టుకథ చెప్పింది.

అప్పటికే భాషా తలుపు తీయమని లోనుండి తలుపును బాదుతున్నాడు. తీసి చూస్తే సుష్మ శవం ఒక వైపు భాషా మరో వైపు వున్నారు. సుష్మ వంటిపై బట్టలు అస్తవ్యస్తంగా వున్నాయి.

జరిగిందేమిటో అందరికీ అర్థమయింది.కోపంగా భాషాను పట్టుకుని కొట్టారు. భాషా తప్పించుకుని పారిపోయాడు.

సుష్మ చనిపోవడంతో ఆమె బంధువుల కోరిక మేరకు దేహాన్ని ఇండియా పంపించారు.

తరువాత పరారీలో వున్న భాషా నీలిమకు ఫోన్ చేసి "తాను ఈ హత్య చెయ్యలేదని తార ఎందుకో కక్షతో ఇందులో ఇరికించిందని, సుష్మ చెల్లి లాంటిదని" మొత్తుకున్నాడు.

"సరే వచ్చి స్టోర్ రూములో వుండు. నీకు అన్నం నీళ్ళు అందిస్తాను. సమయం చూసి నిజం బయట పెడదాం" అంది నీలిమ. ఆ తరువాత స్టోర్ రూములోకి వెళ్ళిన తార భాషాను చూడటం, అతడు తార తలపై కొట్టి పారిపోవడం జరిగాయి

జరిగిన విషయాలన్నీ ఒక్కొక్కటి బయట పడుతుంటే తారను, పీటర్ ను అసహ్యించుకున్నారు అందరూ.

బాబా పోలీసులను పిలిపించి తారను, పీటర్ ను అప్పగించారు. అమాయకురాలైన సుష్మను చంపినందుకు ఉరి శిక్షే వీళ్ళకు సరి అయినదని అందరూ భావించారు.

బాబా భాషాను హత్తుకుని క్షమాపణ చెప్పాడు. మరింత జీతమిస్తానని బుజ్జగించాడు. జిత్తులమారి తార పీడ విరగడ అయినందుకు పనివాళ్ళంతా సంతోషించారు.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments